క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్యవేడు: దాసుకుప్పం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మరమ్మతులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్ అధికారులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిగా శంకరయ్య



నాగలాపురం: నాగలాపురం పంచాయతీ కార్యదర్శిగా ఎస్.శంకరయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆక్రమణపై ఆవేదన



బాధితుడు ఏలుమలై

తిరుపతి కల్చరల్: పిచ్చాటూరు మండలం రామగిరిలోని సర్వే నంబర్ 176/2లో ఉన్న 80 సెంట్ల భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుడు ఎం.ఏలుమలై కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తమ స్వీయార్జితమైన భూమిని కబ్జాదారులు కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నకిలీ పత్రాలు సృష్టించి 2011లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. మూడేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేయించి, తన భూమిని తిరిగి ఇప్పించాలని విన్నవించారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.45 కోట్లు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,45,39,576 వచ్చినట్లు ఆలయ ఈఓ బాపిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలోని కొట్టు మండపం వద్ద హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 39.200 గ్రాములు, వెండి 503.130 కిలోలు విదేశీ కరెన్సీ 106 వచ్చినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు



నిందితుడు కావడి సోమశేఖర్

శ్రీకాళహస్తి: పట్టణంలో చోరీలకు పాల్పడుతున్న కావడి సోమశేఖర్‌ను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. గత సంవత్సరం పట్టణంలోని కైలాసగిరికాలనీలోని ఓ ఇంట్లో దొంగతనం చేశాడు. ఆ కేసు నిమిత్తం శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు పీలేరు సబ్‌జైలు నుంచి పీటీ వారెంట్‌పై శ్రీకాళహస్తి న్యాయస్థానానికి హాజరు పరిచారు. నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న మైనారిటీ నేతలు

శ్రీకాళహస్తి: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ జన్మదినం పురస్కరించుకుని పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద పండ్ల వ్యారులు సలీం, లాల్‌బాషా పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గరికపాటి రమేష్‌బాబు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ రవాణాపై మైనింగ్ అధికారుల దాడులు



బత్తలవల్లం వద్ద గ్రావెల్ అక్రమ రవాణా జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం వద్ద గ్రావెల్ అక్రమ రవాణాపై జిల్లా మైన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. మైన్స్ అధికారులు వస్తున్న విషయాన్ని ముందుగా పసిగట్టిన అక్రమార్కులు వాహనాలను అక్కడి నుంచి ఖాళీ చేశారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంగా గ్రావెల్ అక్రమ రవాణా ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రావెల్ అక్రమ రవాణాపై నివేదిక సిద్ధం చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బడి కోసం.. ఆగని పోరాటం



బంగారమ్మకండ్రిగ పాఠశాలలో పిల్లలు లేక ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుడు



కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు

ప్రభుత్వ పాఠశాలల విలీనం నిలిపివేయాలని కోరుతూ మండలంలోని ఆరు గ్రామాల ప్రజలు, విద్యార్థులు సీపీఐ నేతల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఏళ్ల తరబడి తమ గ్రామాల్లోని బడుల్లోనే పిల్లలు చదువుతున్నారని, ఇప్పుడు వాటిని తీసేసి, సుదూరంలో ఇతర ఊళ్లలో ఉన్న పాఠశాలల్లో కలిపేయడం దారుణమన్నారు. దీంతో పిల్లలు కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే వారం రోజులుగా తమ బిడ్డలను స్కూళ్లకు పంపడం లేదని, పాఠశాలల విలీన ప్రక్రియను నిలిపివేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆందోళనలో బంగారమ్మ కండ్రిగ, గురుకుల కండ్రిగ, తిమ్మసముద్రం, వగత్తూరు, మహదేవపురం, కొట్టాలమిట్ట వాసులు పాల్గొన్నారు.

–కేవీబీపురం



గురుకులకండ్రిగలో 5 రోజుకు చేరిన ఆందోళన

వేడుకగా ఊంజల్ సేవ



ఊయలపై కొలువుదీరిన అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ అమ్మవారికి శుక్రవారం సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం. పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం తిరుచ్చి వాహనంపై అమ్మవారిని కొలువుదీర్చి ప్రాకారోత్సవం జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకుడు శ్రీనివాసభట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెరువులో అస్తి పంజరం లభ్యం

రేణిగుంట: మండలంలోని అత్తూరు చెరువులో అస్తి పంజరం లభ్యం అయిందని గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు అత్తూరు చెరువులో అస్తి పంజరం ఉందని స్థానికులు శుక్రవారం సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అస్థి పంజరం పురుషుడిగా గుర్తించారు. చెరువులో నీళ్ల తగ్గడంతో అస్తి పంజరం బయటపడిందన్నారు. అస్థి పంజరాన్ని కదిలించే పరిస్థితి లేనందున డాక్టర్లను చెరువు వద్దకే పిలిపించి పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్‌ఐ తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేతనాల పెంపునకు డిమాండ్



నూతన కమిటీతో జిల్లా కార్యదర్శి వాణిశ్రీ

సత్యవేడు: సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీవాణి డిమాండ్ చేశారు.. శుక్రవారం అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షులు పద్మలీల, సీఐటీయూ ప్రాంతీయ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సత్యవేడు ప్రాజెక్టు ప్రథమ మహాసభ నిర్వహించారు. శ్రీవాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అలాగే ఫొటో క్యాప్చర్ విధానం తొలగించాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శాంతి, కార్యదర్శిగా నిర్మల, సెక్టార్ సభ్యులుగా భువన, ఝాన్సీ, కాంతమ్మ, ఇరుగుళం సెక్టార్‌కు ఇందిర, వరదయ్యపాళెం సెక్టార్‌కు శారద, అనూష, వందన, మంజుల, జోత్స్న ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

గోబ్యాక్ మోదీ



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రేణిగుంట: ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు వ్యతిరేకంగా గోబ్యాక్ మోదీ అంటూ సీపీఎం కార్యకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ మోదీ ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడంతోపాటు ఆంధ్రుల ప్రతిష్టాత్మక ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేస్తూ ×యోగా దినం×పేరుతో రాష్ట్రంలో కార్యక్రమంలో పాల్గొనడం ప్రజలను వంచించడమే అన్నారు. మీ పాలనలో 2 కోట్ల ఉద్యోగాలు హామీ గల్లంతయ్యిందన్నారు. ధరలు తగ్గిస్తామని చెప్పిన మాట మాయమైందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇస్తామన్న వాగ్దానం గాల్లో కలిసి పోయిందన్నారు. ఆకలి, నిరుద్యోగం, నిధుల లేమితో బాధపడుతున్న ప్రజలను దారి మళ్లించేందుకే యోగా దినోత్సవాన్ని హట్టహాసంగా జరుపుతున్నారన్నారు. కార్యక్రమంలో సెల్వరాజ్, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, కరీంముల్లా, రంగయ్య, రాజశేఖర్, ఈశ్వరి, భారతి, పద్మ, మునస్వామి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులపై సమాచారం ఇవ్వండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

రేణిగుంట: గ్రామంలో అనుమానంగా ఎవరైనా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అర్బన్ సీఐ జయచంద్ర కోరారు. పల్లెనిద్రలో భాగంగా మండలంలోని వెంకటాపురం లో శుక్రవారం రాత్రి సీఐ జయచంద్ర, ఎస్‌ఐ అరుణ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులతో సమావేశమై సైబర్ క్రైమ్, మహిళలపై అత్యాచారాలు, మాదక ద్రవ్యాల నివారణ గురించి అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ముక్కంటి సేవలో పలువురు ప్రముఖులు



ఆలయంలో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ దారునాయక్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చనా మంజుదార్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ దారునాయక్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం





కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ భార్గవి, సర్వే రిపోర్టులను అందిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

ఏర్పేడు: రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ భార్గవి సిబ్బందితో కలసి కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆమె కార్యాలయ సిబ్బందిని సన్మానించి, వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. కార్యక్రమంలో డీటీ రోజారమణి, ఆర్‌ఐ కూనాటి సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఐ నల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు అందించారు.

నారాయణవనం: తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ జయరాములు మాట్లాడుతూ రికార్డులు, యాజమాన్య పత్రాల మేరకు అందరికీ న్యాయం చేస్తామన్నారు. అనంతరం రైతులకు 1బీ, రీసర్వే రిపోర్టులను పంపిణీ చేశారు. 65 ఏళ్లు నిండిన కార్డుదారులకు డీలర్లు తప్పనిసరిగా సరుకులకు ఇంటివద్దకే చేర్చాలని ఆదేశించారు.

వరదయ్యపాళెం: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్, వీఆర్‌ఓలు మధుస్వామి, రవిరెడ్డి, అనీఫ్, నాగేంద్ర, మాధవి తదితరులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ' అక్రమాలపై విచారణ



రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ ఈఈ రామ్మోహన్

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమం కింద నిర్మించిన సిమెంటు రోడ్డు పనుల్లో అక్రమాలపై స్థానికులు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్ శుక్రవారం సాయంత్రం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు మంజూరు ప్రదేశం, నిర్మాణం జరిగిన ప్రాంతంతో పాటు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. పూర్తిస్థాయి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

నాణ్యత లేక బీటలు



పగిలిన సిమెంట్‌రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: కూటమి ప్రభుత్వం పల్లె పండుగలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్లు బీటలు వారుతున్నాయి. మండలంలోని వీయస్‌పురం పంచాయతీ పరిధిలోని వేణుగోపాలపురం గ్రామంలో వేసిన సిమెంట్ పగుళ్లివ్వడంతో స్థానికులు మండిపడుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే నిర్మించిన మూడు నెలలలోనే రోడ్డు దెబ్బతిందని ఆరోపిస్తున్నారు. వేణుగోపాలపురంలో సీసీ రోడ్లకు రూ. 8 లక్షలు మంజూరు చేశారు. మార్చిలో 200 మీటర్లు మేర సిమెంట్‌రోడ్డును కూటమి నేతలు వేశారు. నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో రోడ్డు పూర్తిగా పగిలిపోయిందని వైఎస్సార్‌సీపీ నేత చిట్టిబోయిన కిరణ్‌యాదవ్ విమర్శించారు.

మాధురి జ్యువెలరీస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు వారి భక్తకన్నప్ప వైద్యశాలలో మాధురి జ్యువెలరీస్ ఆధ్వర్యంలో పేదలకు కంటి ఆపరేషన్లు చేయించారు. ఈ సందర్భంగా వారికి కావాల్సిన మందులు, బ్రెడ్లు, పండ్లను మాధురీ జ్యువెలరీస్ నిర్వాహకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్రినేత్ర వైద్యశాల నిర్వాహకులు మాధురి జ్యువెలరీస్ నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. మాధురి గోల్డ్స్ యాజమాన్యం మరింత మందికి సేవలందించాలని వారు ఆకాంక్షించారు.



కంటి అద్దాలు అందజేస్తున్న నిర్వాహకులు

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

రేణిగుంట : రేణిగుంట – మామండూరు రైల్వే మార్గంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ రవి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మామండూరు రైల్వే మార్గంలోని కిలోమీటర్ నంబర్ 143/26–28 వద్ద గురువారం మధ్యాహ్నం రైలు పట్టాలపై వ్యక్తి మృతి చెంది ఉన్నాడని రేణిగుంట డిప్యూటీ స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాము అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. మృతుడికి 45 ఏళ్లు ఉంటాయని, తల, మోకాళ్లు, ఇతర శరీర భాగాలపై రక్త గాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే రేణిగుంట రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని భాస్కరపేటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం రాత్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్‌సీడీ, సీడీ ఆబా ఐడీ, ఈహెచ్‌ఆర్, ఆర్‌సీహెచ్, యూవిన్ తదితర అంశాలపై సమక్షించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు తదితరులు

శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వం పనిగంటలను పెంచి, కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కత్తి రవి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున్, సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి పెనగడం గురవయ్య అన్నారు. పనిగంటల పెంపునకు నిరసనగా శ్రీకాళహస్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు ఇక నుంచి పది గంటలు పని చేయాలన్న క్యాబినెట్ తీర్మానం, చేసి జీఓ జారీ చేయడం తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్మిక సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. అదనపు పని గంటలు చేయవచ్చని... మహిళలు రాత్రుల్లో విధులు చేయవచ్చని చెప్పడం అంటే కార్మికులను వెట్టి చాకిరి చేయించుకునే విధానానికి నెట్టివేయడమేనని చెప్పారు. భవన నిర్మాణ కార్మి సంఘం బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పిన హామీని అమలు చేయాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రొద్ద గోపి, అయ్యప్ప, దిలీప్, గిరిబాబు, దయాకర్, గంధం మణి, గురునాథం, వెంకటేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సేవలు



ధ్రువీకరణపత్రం అందజేస్తున్న తహసీల్దార్ రాజశేఖర్

సత్యవేడు: ప్రజల ముంగిటకే సేవలు అందించడమే లక్ష్యంగా రెవెన్యూ సిబ్బంది పనిచేయాలని తహసీల్దార్ రాజశేఖర్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలైనా రైతులు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఆర్‌ఎస్‌ఆర్, ఎంఎంబీ, అడంగల్, 1బీ పత్రాలను సకాలంలో మంజూరు చేస్తామని వెల్లడించారు. అలాగే కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సైతం అవసరమైన వారికి నిర్ణీత గడువులో పంపిణీ చేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా 78 సేవలను ప్రజలకు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డీటీ త్యాగరాజు, ఆర్‌ఐ సురేష్, వీఆర్‌ఓలు వినోద్‌కుమార్, రమేష్, శేఖర్, కలైవన్, విక్రాంత్, తివేణి, మోహన్ రాజ్, మాధురి పాల్గొన్నారు.

పని గంటల పెంపు తగదు



రేణిగుంటలో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

రేణిగుంట: కార్మికుల పని గంటల పెంపును నిరసిస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు ఇక నుంచి 10 గంటల పని చేయాలని క్యాబినెట్ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయటం దారుణమన్నారు. రాష్ట్రస్థాయి కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవటం ఏమిటని ప్రశ్నించారు. కార్మికవర్గం పోరాట ఫలితంగా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కాదని, నేడు 10 గంటల విధానాన్ని అమలు చేయటం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి నిర్ణయాన్ని మార్చుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఉద్యమబాట పట్టాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి వి. కార్తీక్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వైఎస్ మణి, సీఐటీయూ నాయకుడు హరినాథ్, మురళి, భాను పాల్గొన్నారు.